ముదురుతున్న ముసలం!

కర్ణాటక కాంగ్రెస్‌లో తెగని పంచాయితీ

మంత్రులతో ముఖ్యమంత్రి 'బ్రేక్‌ఫాస్ట్' సమావేశం

డుమ్మా కొట్టిన ఇద్దరు మంత్రులు

బెంగళూరు, నవంబర్ 4: కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో ముసలం కొనసాగుతున్నది. సీఎం సీటుపై ఇప్పటికే డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కన్నేయగా, తాజాగా మరికొంత మంది రేసులోకి వచ్చారు. తాము కూడా సీఎం సీటును ఆశిస్తున్నట్టు ప్రకటనలు చేయడం సంచలనంగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో పరిస్థితి ఎక్కడ 'చేయి' దాటిపోతుందనే భయాందోళనతో తాజాగా సీఎం సిద్ధరామయ్య శనివారం మంత్రులతో అల్పాహార భేటీ నిర్వహించడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకొన్నది. ఈ భేటీకి డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సహా పలువురు మంత్రులు హాజరుకాగా, ఇద్దరు మంత్రులు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. సిద్ధరామయ్య బెంగళూరులో ఏర్పాటు చేసిన ఈ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌కు సీనియర్ మంత్రి సతీశ్ జార్కిహోళి, మరో మంత్రి శరణ్ ప్రకాశ్ పాటిల్ హాజరు కాలేదు. దీంతో కాంగ్రెస్‌లో నెలకొన్న అసంతృప్తి, నేతల మధ్య నెలకొన్న విభేదాలపై ఊహాగానాలు మరింత ఊపందుకొన్నాయి. పార్టీలో అంతర్గతంగా కుమ్ములాటలు తీవ్రస్థాయిలో ఉన్నాయని, మంత్రుల మధ్య సఖ్యత లేదని, మంత్రులు, నేతలు రెండు వర్గాలు చీలిపోయారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ముందు ఆరోగ్యం.. తర్వాతే రాజకీయాలు

అల్పాహార భేటీకి గైర్హాజరు కావడంపై మంత్రులు సతీశ్ జార్కిహోళి, శరణ్ ప్రకాశ్ పాటిల్ పలు కారణాలు చెప్పుకొచ్చారు. తనకు గత 3-4 రోజులుగా ఆరోగ్యం బాగా లేదని, దీని కారణంగా సమావేశానికి హాజరు కాలేకపోయానని సతీశ్ జార్కిహోళి పేర్కొన్నారు. తనకు ఆరోగ్యం ముందు.. తర్వాతే రాజకీయాలు అని, అందుకే సమావేశానికి ఆహ్వానం అందినా వెళ్లలేదని చెప్పారు. అక్కడ సమావేశంలో ఏం జరిగిందో తనకు తెలియదని, ఆదివారం బెంగళూరు వెళ్లిన తర్వాత వివరాలు తెలుసుకొంటానని తెలిపారు. మరోవైపు తనకు ఆహ్వానం అందలేదని, తాను బెళగావి పర్యటనలో ఉన్నానని వైద్య మంత్రి శరణ్ ప్రకాశ్ పాటిల్ పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు ఏమీ లేవని పేర్కొన్న ఆయన.. సీఎంగా సిద్ధరామయ్య కొనసాగుతారా? అన్న ప్రశ్నపై స్పందించేందుకు మాత్రం నిరాకరించారు.

కర్ణాటకలో కరెంటు కష్టాలు నిజమే ..

విద్యుత్తు మంత్రి కేజే జార్జ్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో రైతులకు కరెంటు కష్టాలు నిజమేనని ప్రభుత్వం మరోసారి అంగీకరించింది. రాష్ట్ర రైతాంగానికి సరిపడా కరెంట్ ఇవ్వలేకపోతున్నామని ఇటీవల ఓ టీవీ ఇంటర్వ్యూలో రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి పేర్కొనగా.. తాజాగా రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి కేజే జార్జ్ కర్ణాటకలో నెలకొన్న కరెంట్ సంక్షోభ పరిస్థితులను వివరించారు. ఓ మీడియా సంస్థతో ఆయన మాట్లాడుతూ రైతుల అవసరాలకు తగినట్టు విద్యుత్తు సరఫరా చేయలేకపోతున్నామని అన్నారు. రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ పెరిగిందని, దానికి తగినట్టుగా ఉత్పత్తి తమ వద్ద లేదన్నారు. రైతులకు గతంలో 7 గంటల ఉచిత విద్యుత్తు సరఫరా ఉండేదని, కాని ప్రస్తుతం తమ ప్రభుత్వం విద్యుత్తు సరఫరా సమయాన్ని 5 గంటలకు కుదించిందన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా రైతులకు కరెంట్ సరఫరా చేయలేకపోతున్నామని చెప్పారు. విద్యుత్తు కొరతపై చర్చించేందుకు సీఎం సిద్ధరామయ్య నేతృత్వంలో రెండు రోజుల్లో సమావేశం జరుగనున్నదని, ప్రైవేటు సంస్థల నుంచి విద్యుత్తు కొనుగోలు చేసే విషయంపై నిర్ణయం తీసుకొంటామని వెల్లడించారు. పక్క రాష్ట్రాల నుంచి కూడా విద్యుత్తు కొనేందుకు చర్చలు జరుగుతున్నాయని చెప్పారు.

సమ్మె చేస్తే కఠిన చర్యలు

ఉద్యోగులకు కశ్మీర్ పాలనా యంత్రాంగం హెచ్చరిక

జమ్ము: ప్రభుత్వ ఉద్యోగులు సమ్మెలు, నిరసనలకు దూరంగా ఉండాలని జమ్ముకశ్మీర్ అధికార యంత్రాంగం శుక్రవారం జారీ చేసిన సర్క్యులర్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమ్మెలు, ధర్నాల్లో పాల్గొనేవారిపై కఠినమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. వందలాది మంది ఉద్యోగులను ఏకపక్ష నిర్ణయంతో ఉద్యోగాల నుంచి తొలగించడం, రాష్ట్ర భద్రతకు ముప్పు కలిగించారనే ఆరోపణలపై దాదాపు 50 మంది ఉద్యోగులను తొలగించిన కొద్ది రోజులకే ఈ సర్క్యులర్ జారీ కావడం గమనార్హం. ఇటీవల కాలంలో అసంతృప్తితో ఉన్న ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం వీధుల్లోకి వచ్చి నిరసన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వేలాది కాంట్రాక్టు ఉద్యోగులు తమ జీతాలు పెంచాలని, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని సమ్మె చేస్తున్నారు. అసమ్మతి తెలిపే ప్రతి గళాన్ని అణచివేసేందుకు అధికార యంత్రాంగం ప్రయత్నిస్తున్నదని విపక్షాలు విమర్శించాయి.

మియా ముస్లింల ఓట్లు మాకు వద్దు: హిమంత

న్యూఢిల్లీ, నవంబర్ 4: అస్సాంలోని మియా ముస్లింల (బెంగాల్‌కు చెందిన ముస్లింలు) నుంచి తాము ఓట్లు ఆశించడం లేదని ఆ రాష్ట్ర సీఎం హిమంత బిశ్వ శర్మ చెప్పారు. అందుకే వాళ్లు ఎక్కువగా ఉన్న మెడికల్ కాలేజీలను సందర్శించడం లేదని తెలిపారు. రాష్ట్రంలోని ముస్లింల అభివృద్ధిపైనే తమ దృష్టి ఉంటుందని, వలస వచ్చిన మియా ముస్లింలపై కాదని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై ఆల్ ఇండియా యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ చీఫ్ మౌలానా బద్రుద్దీన్ అజ్మల్ స్పందిస్తూ మియా ముస్లింలు గువాహటిలో మూడు రోజులపాటు పనిచేయకపోతే ఈ ప్రాంతం శ్మశాన వాటికగా మారుతుందని వ్యాఖ్యానించారు.

కేంద్రంపై విద్యార్థుల గర్జన

- ఐక్య వేదికగా ఏర్పడిన 16 విద్యార్థి సంఘాలు
- నూతన విద్యా విధానం, ఫీజుల పెంపుపై నిరసన
- విద్యాసంస్థల్లో మతచిచ్చు రేపడంపై తీవ్ర ఆగ్రహం

న్యూఢిల్లీ, నవంబర్ 4: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థి లోకం ఏకమవుతున్నది. నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ), విద్యాసంస్థల ప్రాంగణాల్లో మతచిచ్చు రేపడం, ఫీజుల పెంపును నిరసిస్తూ దేశంలోని 16 ప్రముఖ విద్యార్థి సంఘాలు జాయింట్ ఫ్రంట్‌గా ఏర్పడ్డాయి. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, సీఆర్‌జేడీ, డీఎంకే స్టూడెంట్స్ వింగ్, ఎన్ఎస్‌యూఐ, సమాజ్‌వాది ఛత్ర సభ తదితర లెఫ్ట్, విపక్ష పార్టీల విద్యార్థి సంఘాలు ఇందులో ఉన్నాయి. భాగస్వామ్య పక్షాలను సంప్రదించకుండా ఏకపక్షంగా నూతన విద్యా విధానాన్ని తేవడంపై విద్యార్థి సంఘాలు మండిపడ్డాయి. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలలో చరిత్ర, ఇతర సబ్జెక్టులలో కొన్ని అధ్యాయాలు తొలగించడం ద్వారా కేంద్రం మతతత్వాన్ని రెచ్చగొడుతున్నదని విమర్శించాయి. విద్యపై రాజ్యాంగ దార్శనికతకు ఇది పూర్తి విరుద్ధమని మండిపడ్డాయి. అంతేకాకుండా దేశం పేరు 'ఇండియా'ను సైతం పాఠ్య పుస్తకాల నుంచి తొలగించేందుకు బీజేపీ యత్నిస్తున్నదని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యాసంస్థల్లో ఫీజుల పెంపు, ఎన్ఈపీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రచారం చేయనున్నట్టు వెల్లడించారు.

ఉచిత రేషన్ మరో ఐదేండ్లు

- ప్రధాని నరేంద్రమోదీ ప్రకటన
- ఎన్నికల వేళ మరో తాయిలం

దుర్గ్/రత్లాం, నవంబర్ 4: త్వరలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతోపాటు లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ప్రధాని మోదీ మరో తాయిలం ప్రకటించారు. ఉచితాలకు వ్యతిరేకంటూ తరచూ ఊదరగొట్టే ప్రధాని.. ఇప్పుడు ఎన్నికల వేళ అదే ఉచిత ప్రకటన చేశారు. ఎన్నికల్లో ప్రజలను ఆకర్షించే లక్ష్యంతో 'ఉచిత్ రేషన్' స్కీమ్‌ను పొడిగించనున్నట్టు తాజాగా ప్రకటించారు. పేదలకు మరో ఐదేండ్ల పాటు ఈ పథకాన్ని పొడిగించాలని తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నదని ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో శనివారం నిర్వహించిన ఎన్నికల ర్యాలీల్లో మోదీ పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్, మధ్యప్రదేశ్‌లోని రత్లాంలో జరిగిన బీజేపీ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మాట్లాడారు. ఉచిత రేషన్ పొడిగింపును 'మోదీ గ్యారంటీ'గా ఆయన చెప్పుకొన్నారు. ఈ పథకం పొడిగింపు వల్ల పేదలకు డబ్బు ఆదా ఆవుతుందని, వాటితో వేరే అవసరాలు తీర్చుకోవచ్చని అన్నారు. దుర్గ్ ర్యాలీ సందర్భంగా ఛత్తీస్‌గఢ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వంపై మోదీ విమర్శలు గుప్పించారు. ఆ పార్టీ పేదలను పేదలుగానే ఉంచాలని అనుకుంటుందని ఆరోపించారు. మోసం తప్ప పేదలకు కాంగ్రెస్ ఏమీ ఇవ్వలేదన్నారు. ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బఘేల్‌కు బెట్టింగ్ యాప్ నిర్వాహకులతో సంబంధం, వారి నుంచి కాంగ్రెస్‌కు ముడుపులు అందుతున్నాయని వస్తున్న ఆరోపణలు మోదీ ప్రస్తావించారు.

6 నుంచి ఎలక్టోరల్ బాండ్ల విక్రయం

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ, నవంబర్ 4: త్వరలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలకు నిధులను సమకూర్చే ఎలక్టోరల్ బాండ్లను ఈ నెల 6 నుంచి విక్రయించడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎస్బీఐకి చెందిన 29 బ్రాంచీల్లో ఈ నెల 20 వరకు ఎలక్టోరల్ బాండ్ల విక్రయాలు కొనసాగుతాయని ప్రభుత్వం తెలిపింది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం ఒక శాతం ఓట్లు తెచ్చుకున్న గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ఈ ఎలక్టోరల్ బాండ్లు స్వీకరించడానికి అర్హత పొందుతాయి.

నిరుద్యోగానికి కేరాఫ్ రాజస్థాన్

- ఉద్యోగాల కోసం 18.4 లక్షల మంది ఎదురుచూపులు
- ఐదేండ్ల కాంగ్రెస్ పాలనలో డజనుకు పైగా పేపర్ లీకులు
- నిరుద్యోగితలో రెండోస్థానం.. కాంగ్రెస్ సర్కారుపై అసంతృప్తి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): 'గురివింద గింజ' నీతిని తలపిస్తున్నది కాంగ్రెస్ నాయకుల వైఖరి. ప్రత్యేక రాష్ట్రంలో 2.32 లక్షల ప్రభుత్వ కొలువులకు అనుమతులనిచ్చిన బీఆర్ఎస్ సర్కారుపై అడ్డగోలు ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ పెద్దలు.. తమ ఏలుబడిలోని రాజస్థాన్‌లో నిరుద్యోగం ఎలా తాండవిస్తున్నదన్న విషయాన్ని విస్మరిస్తున్నారు. దేశంలో అత్యధిక నిరుద్యోగం ఉన్న రాష్ట్రాల్లో రాజస్థాన్ రెండో స్థానంలో ఉండటం దీనికి రుజువు.

కాంగ్రెస్ హయాంలో రాజస్థాన్‌లో నిరుద్యోగం ఇలా..

ఆర్థిక సంవత్సరం	నిరుద్యోగిత రేటు (శాతాల్లో)
2018-19	9.9
2019-20	11.89
2020-21	19.06
2021-22	25.08
2022-23	26.21

ఐదేండ్లలో 12 పేపర్ లీకేజీలు

నిరుద్యోగానికి, పరీక్షా పత్రాల లీకేజీలకు, నిరుద్యోగ భృతి హామీల ఎగవేతకు రాజస్థాన్‌లోని కాంగ్రెస్ సర్కారు చిరునామాగా మారింది. రాష్ట్రంలో 18.4 లక్షల కంటే ఎక్కువ మంది నిరుద్యోగులు ఉన్నట్టు గత ఫిబ్రవరిలో అసెంబ్లీలో ప్రభుత్వమే ఒప్పుకొన్నది. ఇందులో 14.4 లక్షల మంది గ్రాడ్యుయేట్లు, లక్ష మందికి పైగా పీజీ, పీహెచ్‌డీలు చేసినవారు ఉన్నారు. 2018లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పరీక్షా పత్రాలు లీక్ కావడంవల్ల కనీసం 12 పరీక్షలను రద్దు చేశారు. గడిచిన పదేండ్లలో 26 పరీక్షా పత్రాలు లీకేజీకి గురైనట్టు ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. ఇక, నిరుద్యోగులందరికీ భృతి ఇస్తామన్న గెహ్లాట్ ప్రభుత్వం మొత్తం 18.4 లక్షల మంది నిరుద్యోగుల్లో కేవలం 1.9 లక్షల మందికే భృతిని చెల్లించింది. అది కూడా మూడు నెలలు మాత్రమే. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియా ఎకానమీ (సీఎంఐఈ) గణాంకాల ప్రకారం.. దేశంలో అత్యధిక నిరుద్యోగం ఉన్న రాష్ట్రాల్లో హర్యానా (26.8 శాతం) తొలిస్థానంలో ఉండగా, రెండో స్థానంలో రాజస్థాన్ (26.4 శాతం) నిలిచింది. రాజస్థాన్ శ్రామిక శక్తిలో ప్రతీ నలుగురిలో ఒకరు నిరుద్యోగిగా ఉన్నట్టు అర్థమవుతున్నది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగ నియామకాల్ని చేపట్టని సర్కారుకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్తామని హెచ్చరిస్తున్నారు.

కాంగ్రెస్ దళిత వ్యతిరేకి

దళిత అధికారులపై రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ వివక్ష

ఎస్సీ కమిషన్ పదవికి ఆ పార్టీ నేత ఖిలాడీలాల్ రాజీనామా

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 4(నమస్తే తెలంగాణ): రాజస్థాన్ కాంగ్రెస్ దళిత నేత, ఎస్సీ కమిషన్ అధ్యక్షుడు ఖిలాడీలాల్ భైరవ సొంత పార్టీపై తీవ్ర ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ దళిత వ్యతిరేకి అని మండిపడ్డారు. సీఎం అశోక్ గెహ్లాట్ దళితుల పట్ల ఎప్పుడూ నిర్లక్ష్యంగానే ప్రవర్తించారని, వారిని ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారన్నారు. దళిత ఐఏఎస్ అధికారులకు ప్రాముఖ్యమున్న పదవులు ఇవ్వలేదని ఆరోపించారు. పార్టీ ఆదేశానుసారం తనను ఎస్సీ కమిషన్ అధ్యక్షుడిగా నియమించినా.. రాజ్యాంగబద్ధమైన గుర్తింపు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఖిలాడీలాల్.. బసోడి అసెంబ్లీ సీటు ఆశించి భంగపడ్డారు.

నేపాల్‌లో భారీ భూకంపం సంభవించింది. రాజధాని కాఠ్మాండూకు పశ్చిమంగా 500 కిలోమీటర్ల దూరంలోని పర్వత ప్రాంతంలో శుక్రవారం రాత్రి 11.47 గంటల సమయంలో సంభవించిన ఈ విపత్తులో 157 మంది మరణించగా, 375 మందికి పైగా గాయపడ్డారు. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 6.4గా నమోదైంది. జజర్‌కోట్ జిల్లాలో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్టు ఎన్‌ఈఎంఆర్‌సీ పేర్కొన్నది. భూకంప తీవ్రతకు భారత్‌లోని ఢిల్లీతోపాటు పలు ప్రాంతాల్లో ప్రకంపనలు చోటుచేసుకొన్నాయి.

గల్లీకో గురుద్వారానా?.. కూల్చిపారేయాలి!

రాజస్థాన్ బీజేపీ నేత సందీప్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్(నమస్తే తెలంగాణ): గురుద్వారాలను కూల్చిపారేయాలంటూ ఓ బీజేపీ నేత చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. రాజస్థాన్‌లోని తిజారాలో జరిగిన ప్రచార సభలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ పాల్గొన్నారు. ఈ సభలో బీజేపీ మాజీ ఎమ్మెల్యే సందీప్ దాయ్‌మా మాట్లాడుతూ తిజారాలో ఎక్కడ పడితే అక్కడ గురుద్వారాలు కట్టారని, అవి మనకు భవిష్యత్తులో నష్టదాయకంగా మారతాయని, వాటిని కూల్చిపారేయాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. అది మన బాధ్యతని నొక్కి చెప్పారు. దీనికి యోగి కూడా చప్పట్లు కొట్టారు. సందీప్ వ్యాఖ్యలపై సిక్కులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన దిష్టి బొమ్మలను దహనం చేశారు. దీంతో సందీప్ క్షమాపణలు చెప్పారు. గురుద్వారాకు వెళ్లి క్షమాపణ పత్రం రాసిచ్చారు. శిరోమణి గురుద్వారా కమిటీ నిర్ణయం మేరకు ఏ శిక్షకైనా సిద్ధమన్నారు. సంజయ్ రాసిచ్చిన క్షమాపణ పత్రాన్ని అమృత్‌సర్ అకల్ తఖ్త్ కమిటీకి పంపుతామని స్థానిక గురుద్వారా నిర్వహణ కమిటీ ప్రకటించింది.

ప్రభుత్వాలకు ఆ అధికారం లేదు: సీజేఐ

న్యూఢిల్లీ: తీర్పుల్లోని లోపాలను సరిచేయడానికి చట్టసభలు కొత్త చట్టాలు రూపొందించవచ్చని, కానీ తీర్పులను నేరుగా తోసిపుచ్చే అధికారం ప్రభుత్వాలకు లేదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పష్టంచేశారు. కోర్టు తీర్పులపై ప్రభుత్వాలు ఎంతవరకూ స్పందించవచ్చో రాజ్యాంగంలో స్పష్టంగా ఉందన్నారు. కేసులను విచారించి, తీర్పులిచ్చేటపుడు, సమాజం ఏ విధంగా స్పందిస్తుందనే విషయాన్ని కోర్టులు ఆలోచించవని తెలిపారు. రాజ్యాంగానికి మాత్రమే న్యాయమూర్తులు కట్టుబడతారని, ప్రభుత్వానికి కాదన్నారు. ప్రభుత్వాలకు, న్యాయస్థానాలకు ఉన్న తేడా ఇదేనని చెప్పారు. సమాన అవకాశాలు ఉంటే మహిళలు మరింత ఎక్కువ మంది న్యాయ వ్యవస్థలోకి వస్తారన్నారు. శనివారం హిందూస్థాన్ టైమ్స్ నిర్వహించిన నాయకత్వ శిఖరాగ్ర సదస్సులో సీజేఐ ఈ మేరకు మాట్లాడారు.

పెన్షన్ కోసం 40 ఏండ్లు తిప్పించుకుంటారా?

కేంద్రంపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: ఒక వృద్ధ స్వాతంత్ర్య సమరయోధుడికి పింఛన్ చెల్లించడంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రూ.20 వేల జరిమానా విధించింది. పెన్షన్ కోసం 96 ఏండ్ల వృద్ధుడిని 40 ఏండ్ల పాటు తిప్పించడం తీవ్రమైన అంశమని జస్టిస్ సుబ్రమణియమ్ ప్రసాద్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బాధితుడు ఉత్తమ్ లాల్ సింగ్‌కు ఇవ్వాల్సిన స్వతంత్ర సైనిక్ సమ్మాన్ పెన్షన్‌ను 1980 నుంచి ఆరు శాతం వడ్డీతో 12 వారాల్లోగా చెల్లించాలని ఉత్తర్వులిచ్చారు. 1927లో జన్మించిన సింగ్ స్వాతంత్ర్య సమరం సందర్భంగా జరిగిన క్విట్ ఇండియా, ఇతర ఉద్యమాల్లో పాల్గొన్నారు. అయితే తనకు పెన్షన్ ఇవ్వాలని 40 ఏళ్లుగా పోరాటం చేస్తున్నా కేంద్రం పట్టించుకోకపోవడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

అంబానీకి బెదిరింపు లేఖలు.. వరంగల్ యువకుడి అరెస్ట్

ముంబై: పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీని బెదిరిస్తూ ఈ-మెయిల్స్ పంపిన ఇద్దరు యువకులను ముంబై పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో ఒకరు వరంగల్‌కు చెందిన గణేశ్ రమేశ్ వన్రపతి (19) కాగా, మరొకరు గుజరాత్‌కు చెందిన షాదాబ్ ఖాన్ (21). వేర్వేరు ఈ-మెయిల్స్ ద్వారా వీరు అంబానీకి బెదిరింపు లేఖలు పంపినట్టు అధికారులు తెలిపారు. అక్టోబర్ 27న తొలి మెయిల్ పంపారు. రూ.20 కోట్లు చెల్లించాలని, లేదంటే చంపేస్తామని బెదిరించారు. ఆ మర్నాడే మరో ఈ-మెయిల్ వచ్చింది. ఈ సారి రూ.200 కోట్లు డిమాండ్ చేశారు. మరొక ఈ-మెయిల్‌లో రూ.400 కోట్లు ఇవ్వాలని బెదిరించారు. దీనిపై ముంబైలోని గమ్‌దేవ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

కూలిన నేవీ హెలికాప్టర్.. సెయిలర్ మృతి

కొచ్చి: భారత నావికాదళానికి చెందిన శిక్షణ హెలికాప్టర్ శనివారం ఉదయం కొచ్చిలోని ఐఎన్ఎస్ గరుడ నావల్ ఎయిర్‌స్టేషన్ రన్‌వేపై కుప్పకూలింది. ఈ ప్రమాదంలో నావికా దళ సెయిలర్ యోగేంద్ర సింగ్ ప్రాణాలు కోల్పోయారు. ఆయన మధ్యప్రదేశ్‌కు చెందినవారు. శిక్షణ ఇవ్వడం కోసం బయల్దేరిన ఈ చేతక్ హెలికాప్టర్ కాసేపటికే కూలిపోయినట్లు అధికారులు వెల్లడించారు. ఘటనపై దర్యాప్తునకు ఆదేశించినట్టు తెలిపారు.

తనకు తాను రిపేర్ చేసుకొనే ప్లాస్టిక్!

టోక్యో, నవంబర్ 4: తనను తాను రిపేర్ చేసుకొనే, పాక్షికంగా బయోడీగ్రేడబుల్ అయ్యే ప్లాస్టిక్‌ను జపాన్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. దీన్ని వేడిచేసిన తర్వాత కావాల్సిన రూపంలోకి మార్చుకోవచ్చు. పర్యావరణ హిత ప్లాస్టిక్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో జపాన్‌కు చెందిన టోక్యో యూనివర్సిటీ పరిశోధకులు ప్రిటిమర్ ఎపాక్సీ రెజిన్ ఆధారంగా సరికొత్త ప్లాస్టిక్ రూపొందించారు. ఇది సాధారణ ప్లాస్టిక్ కంటే బలంగా ఉంటుంది. అంతేకాదు తనకు తాను మరమ్మతు చేసుకుంటుంది. సముద్ర జలాల్లో కలిస్తే బయోడీగ్రేడబుల్ అయ్యి సముద్ర జీవులకు ఆహారం అవుతుంది.

ఉప్పుతో మధుమేహం!

- అధికంగా ఉప్పు తింటే టైప్-2 డయాబెటిస్
- హార్మోన్ ఇన్సులిన్ శక్తిని తగ్గిస్తున్న లవణం
- శరీరంలో చక్కెరలను నియంత్రించేది ఇన్సులినే
- టులేన్ యూనివర్సిటీ పరిశోధకుల వెల్లడి

బర్మింగ్‌హామ్: మధుమేహం.. ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యల్లో ప్రధానమైనది. భారతదేశంలో ఇప్పటికే 10 కోట్లమందికి పైగా మధుమేహ రోగులున్నారు. వచ్చే 5 ఏండ్లలో ఈ సంఖ్య 23 కోట్లు దాటుతుందని ఇటీవలే ఓ సర్వే తేల్చింది. మధుమేహం ఎందుకు వస్తుందన్న అంశంపై ఇప్పటివరకు సరైన అవగాహన లేదు. తీపి పదార్థాలు అధికంగా తినటం వల్ల మధుమేహం వస్తుందన్న అపోహలోనే చాలామంది ఉన్నారు. మధుమేహం రావటానికి తీపి పదార్థాలు ఒక కారణం మాత్రమే కానీ.. పూర్తిగా అవే కారణం కాదని పరిశోధకులు తేల్చారు. అయితే, తాజాగా వెల్లడైన ఓ సర్వే మధుమేహ కారణాలపై కొత్త సూత్రీకరణలకు దారితీస్తున్నది. మధుమేహం రావటానికి ప్రధాన కారణాల్లో ఉప్పుది కీలక పాత్ర అని టులేన్ యూనివర్సిటీ పరిశోధకులు ప్రకటించారు. దాదాపు 12 ఏండ్లపాటు 4 లక్షల మందిపై అధ్యయనం చేసి మరీ ఈ ఫలితాలను వెల్లడించారు.

అధిక ఉప్పు మహా ప్రమాదం

ప్రతి ఇంటిలోనూ ఉప్పు వాడటం తప్పనిసరి. వంటల్లో వేయటంతోపాటు చాలామంది భోజనం చేసేటప్పుడు మరికొంత ఉప్పును ఆహారంలో చల్లుకొంటుంటారు. డైనింగ్ టేబుల్స్ ఉన్న ఇంట్లో అయితే.. దానిపై ఉప్పు డబ్బా ఉండటం తప్పనిసరి. ఈ అలవాటే ఇప్పుడు ప్రాణాంతకంగా మారుతున్నదని టులేన్ వర్సిటీ పరిశోధకులు చెప్తున్నారు. యూకే బయోబ్యాంక్ స్టడీ సంస్థ నుంచి 4 లక్షల మంది పౌరుల ఆరోగ్య వివరాలను తీసుకొని వీరు విశ్లేషించారు. ఈ 4 లక్షల మందిలో 12 ఏండ్లలో 13 వేల మంది డయాబెటిక్ బారిన పడ్డారు. ఇందుకు వారి ఆహారంలో అధికంగా ఉప్పును తీసుకోవటమే కారణమని పరిశోధకులు చెప్తున్నారు. బ్రిటన్‌లో ఒక వ్యక్తి సగటున రోజుకు 8 గ్రాముల (2 టేబుల్ స్పూన్లు) ఉప్పు తింటున్నాడు. దానిని 6 గ్రాములకు తగ్గించేందుకు అక్కడి ఆరోగ్య శాఖ ప్రయత్నాలు చేస్తున్నది. రోజూ మనం తీసుకొనే ఉప్పులో 1 గ్రాము తగ్గించినా డయాబెటిక్ బారిన పడకుండా కాపాడుకోవచ్చని ఈ పరిశోధకులు చెప్తున్నారు. అయితే, ఉప్పు నేరుగా మధుమేహ వ్యాధికి ఎలా కారణమవుతుందన్న విషయం మాత్రం తేలలేదని చెప్పారు.

ఇన్సులిన్‌పై ప్రభావం

మనిషి శరీరంలో అన్ని వ్యవస్థలు సవ్యంగా జరిగేలా చూసేది క్లోమం (పాంక్రియాస్). క్లోమం విడుదల చేసే హార్మోన్ ఇన్సులిన్.. శరీరంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. జీవకణాలు చక్కెరలను (గ్లూకోజ్) పీల్చుకొనేందుకు సహాయపడేది ఇన్సులిన్. ఉప్పు అధికంగా తినటం వల్ల అది ఈ హార్మోన్ ఇన్సులిన్‌ను బలహీనపరుస్తున్నదని ఈ పరిశోధనలో తేలింది. మూత్రంలో సోడియం అధికంగా బయటకు వెళ్లేవారిలో మధుమేహం వచ్చే ప్రమాదం అధికమని గుర్తించారు. ఇలా సోడియం అధికంగా బయటకు వెళ్లేవారిలో ఇన్సులిన్ శక్తి తక్కువగా ఉంటుందని, అది మధుమేహానికి దారితీస్తున్నదని వెల్లడించారు.

ప్రాసెస్డ్ ఫుడ్‌తోనే సమస్య

ప్రాసెస్డ్ ఫుడ్ (షాపుల్లో తినటానికి సిద్ధంగా లభించే ఆహారం) వల్ల మనకు తెలియకుండా అధిక స్థాయిలో ఉప్పు తింటున్నామని ఈ పరిశోధకులు పేర్కొన్నారు. ఇంట్లో వండుకొనే వంటల్లో ఉప్పును అవసరం మేరకే వేసుకోవటం అందరికీ అలవాటే. బయట దొరికే ప్రాసెస్డ్ ఆ